# సాక్షి
## వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 12 । నవంబర్ । 2024






### భక్తిశ్రద్ధలతో కార్తిక పూజలు

గంగాధరుడి దర్శనం కోసం చీకటిని లెక్కచేయక భక్తులు తెల్లవారుజామునుంచి ఆలయాల వద్ద బారులు తీరారు. ఆలయాల ప్రాంగణాల్లో కార్తీక దీపం వెలిగించి తన్మయులయ్యారు. కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఘనంగా పూజలు జరిగాయి. -కడప కల్చరల్

గరిష్టం/కనిష్టం
33.6/22.4

### వాతావరణం

జిల్లాలో సోమవారం 22.4 – 33.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

### మోసపు బడ్జెట్‌లో హామీలు క్లీన్‌బౌల్డ్



ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నికల మేనిఫెస్టోకు భిన్నంగా ఉంది. ఇది పూర్తిగా ప్రజలను మోసం చేసే బడ్జెట్. హామీలు అమలు చేయడానికి అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించలేదు. ఈ ఏడాది ప్రజలకు ఇచ్చిన హామీలు క్లీన్‌బౌల్డ్ అయినట్లే. సూపర్ 6 పథకాల కథ దేవుడెరుగు.. ప్రతి నెల మహిళలకు ఇస్తానన్న రూ.1500 పథకం, 50 ఏళ్లకే పింఛన్ పథకం, నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు.. ఏ ఒక్కటీ అమలయ్యే పరిస్థితి లేదు. అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను అమలు చేస్తామని చెప్పి అధికారం చేపట్టిన చంద్రబాబు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మరో మారు మోసం చేశారు. బాబు సావాసం పట్టిన బీజేపీ కూడా భ్రష్టుపట్టింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గురించి చర్చించుకోవాల్సిన అవరమే లేదు. బాబు దృష్టిలో పవన్‌కళ్యాణ్ పేకాటలో జోకర్ లాంటి వాడు. మూడు పార్టీల నేతలు కలసి ప్రజలను మోసం చేశారు.

– రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, అధికార ప్రతినిధి, వైఎస్సార్ సీపీ

### విద్యారంగానికి నష్టం



జాతీయ విద్యా దినోత్సవం రోజు కూటమి ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ విద్యారంగానికి తీరని నష్టాన్ని కలిగించింది. విద్యారంగానికి గత ప్రభుత్వం కంటే 10.8 శాతం తక్కువ బడ్జెట్‌ని కేటాయించారు. విద్యార్థులు పెట్టుకున్న ఆశలపై నీళ్లు చల్లింది. మొదటి బడ్జెట్ లోనే విద్యారంగానికి ఇలా బడ్జెట్ ను ప్రవేశపెట్టడం చాలా అన్యాయం. ఇది విద్యాలోకానికి తీరనిలోటు.

– కోదూరు మల్లికార్జున, ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

### ఉద్యోగులను నిరాశపరిచిన బడ్జెట్



ఏపీ రాష్ట్ర బడ్జెట్ ఉద్యోగ, ఉపాధ్యాయులను నిరాసపరిచింది. 21 వేల పెడింగ్ బకాయిలు చెల్లింపును బడ్జెట్‌లో చూపించలేదు. పిఆర్‌సీ గడువు ముగిసి 16 నెలలు గడుస్తున్నా బడ్జెట్‌లో ఐఆర్ చెల్లింపుల ఊసేలేదు. 010 కింద ఉద్యోగుల వేతనాలు బడ్జెట్ వార్షికం మొత్తాన్ని ఒకేసారి కేటాయించాలి.

– సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి, రాష్ట్ర అధ్యక్షుడు



# మొండిచేయి!



వైఎస్సార్ జిల్లాకు కూటమి ప్రభుత్వం మరోసారి మొండిచేయి చూపింది. ఇక్కడి ప్రజల, రైతుల ప్రయోజనాలను విస్మరించింది. రబీకి ప్రీమియం రైతులే చెల్లించుకోవాలని తేల్చి చెప్పింది. మెట్ట ప్రాంత రైతులకు ప్రయోజనకారిగా నిలుస్తున్న జలసిరి పథకానికి అరకొర నిధులు కేటాయించింది. నిరుద్యోగ యువతకు శాశ్వత ప్రాతిపదికన ఉపాధి కల్పించాలనే సంకల్పం కొరవడింది. కేసీ కెనాల్ ఆయకట్టు స్థిరీకరణ కోసం నిర్మించదలిచిన రాజోలి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది.

- రైతులపై సవతి తల్లి ప్రేమ
- మెట్ట రైతులకు యోగ్యకరమైన జలసిరికి నిధుల కొరత
- నిరుద్యోగులకు లభించని ప్రాధాన్యత
- ఉక్కు ఫ్యాక్టరీ ఊసే లేదు
- ఎన్నికల హామీలు అమలుకు కేటాయింపులు నిల్
- మమ అన్పించిన ఎన్‌డీఏ కూటమి సర్కార్ బడ్జెట్



సాక్షి ప్రతినిధి, కడప: రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి బడ్జెట్‌ను (2024–2025) సోమవారం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రూ.2.94 లక్షల కోట్లతో ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో ఉన్నత విద్యకు, నిరుద్యోగ యువత ఉపాధి కల్పన కోసం పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యత దక్కలేదు.

ముఖ్యమంత్రి చంద్రబాబు కొత్తగా పరిశ్రమలను స్థాపించి వాటి ద్వారా సంపద సృష్టిస్తానని ప్రకటిస్తూ వచ్చారు. అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పన కోసం బడ్జెట్‌లో ప్రాధాన్యత లోపించిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష కడప ఉక్కు పరిశ్రమకు బడ్జెట్‌లో కేటాయింపులు చెయ్యకపోవటం జిల్లాపై నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మరో వైపు ఎన్నికల హామీ నెరవేర్చే ప్రక్రియ రాష్ట్ర బడ్జెట్‌లో కన్పించలేదు. ప్రతి మహిళకు రూ.18వేలు ఊసేలేదు. నిరుద్యోగ భృతి గురించి యోచనే లేదు. ఉచిత బస్సు ప్రయాణానికి కేటాయింపుల్లేవు. ఇక తల్లికి వందనానికి అరకొర నిధులేనని.. సూపర్ సిక్స్ హామీలకు తగిన బడ్జెట్ కేటాయింపుల్లేవని పలువురు మండిపడుతున్నారు.

**సంఖ్య కన్పిస్తున్నా అవసరాలకు అరకొర నిధులే**

జీఎన్ఎస్ఎస్‌లో భాగంగా గండికోట, సర్వారాయసాగర్, వామికొండ రిజర్వాయర్లు పూర్తి అయ్యాయి. వాటి పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ఏర్పాటు కాలేదు. ప్రస్తుతం జీఎన్ఎస్ఎస్ కేటాయింపులు రూ.2,254 ఉన్నా, పెండింగ్ బిల్లులు రూ.1400 కోట్లు ఉన్నాయి. తక్కిన నిధులు నామమాత్రమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరో వైపు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌కు భూసేకరణ, నిర్మాణానికి తగిన స్థాయిలో నిధులు లభించలేదనే నిపుణులు వివరిస్తున్నారు. మొత్తంగా పరిశీలిస్తే చంద్రబాబు సర్కార్ ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పై సవతి తల్లి ప్రేమ చూపిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**జిల్లా ప్రాజెక్టులు బడ్జెట్‌లో కేటాయింపులు (రూ.కోట్లల్లో)**

| | |
|---|---|
| తెలుగుగంగ: | 422.00 |
| గాలేరు-నగరి: | 2,254.08 |
| పులివెందుల కాలువ: | 305.38 |
| వెలిగొండ: | 393.49 |
| హంద్రీ-నీవా: | 867.75 |
| కేసీ కెనాల్: | 253.10 |
| ఎస్సార్బీసీ: | 44.32 |

### రాజోలికి నిధులు నిల్...



కేసీకెనాల్‌కు ఆయువుపట్టు రాజోలి రిజర్వాయర్. జిల్లాలో 95వేల ఎకరాలు స్థిరీకరణకు ఉపయోగపడ్డ ఈ రిజర్వాయర్‌కు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.225కోట్లు కేటాయించింది. ప్రస్తుత కూటమి సర్కార్ బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు అస్సల్లేవు. వెరసి కేసీ కెనాల్ ఆయకట్టుదారులకు ఆశనిపాతంగా మారింది. జిల్లాలో అతిపెద్ద ఆయకట్టు ఉన్న కేసీ కెనాల్ స్థిరీకరణ చోటు చేసుకుంటే జమ్మలమడుడు, ప్రొద్దుటూరు, కమలాపురం, మైదుకూరు, కడప నియోజకవర్గాల రైతులకు ఎంతో ప్రయోజనం లభించేది. అలాంటి ప్రాజెక్టును చంద్రబాబు సర్కార్ విస్మరించడం గమనార్హం. మెట్ట ప్రాంత రైతులకు ఎంతో ఉపయోగమైన జలసిరి పథకానికి కేవలం రూ.50కోట్లు కేటాయించి మమ అన్పించారు. గ్రేటర్ రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఉచిత బోర్లు ఉపయోగం. నిధులు కేటాయింపులో అరకొరగా చూపి మెట్ట రైతులకు అన్యాయం చేశారని పలువురు వాపోతున్నారు.

### రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీ



రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీగా ఉంది. పరిశ్రమలు, వాణిజ్యానికి నిధులు తగ్గించారు. సూపర్ సిక్స్ హామీల ఊసే లేదు. కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం ఇస్తామన్నారు.. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలు ఇచ్చారు.. వాటి అమలుకు నిధుల కేటాయింపులు లేకపోవడం దారుణం. అన్ని వర్గాల ప్రజలను ఈ బడ్జెట్ నిరాశ పరిచింది.

– అంజద్‌బాషా, మాజీ డిప్యూటీ సీఎం

### పథకాలకు తూట్లు పొడిచారు



రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు తూట్లు పొడిచారు. సూపర్ సిక్స్ హామీల వల్లే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చాక ఆ పథకాల జోలికి పోవడం లేదు. ఈ బడ్జెట్‌లో కూడా ధరల స్థిరీకరణ నిధికి, ఎన్‌టీఆర్ జలసిరికి తక్కువ కేటాయింపులు చేశారు. సాగునీటి రంగానికి అన్యాయం చేశారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి మోసం చేశారు.

–సురేష్‌బాబు, మేయర్

### బడ్జెట్‌లో రైతులు, నిరుద్యోగులకు మోసం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



కడప కార్పొరేషన్: రైతులు, నిరుద్యోగులు, మహిళలకు మోసం చేసే విధంగా రాష్ట్ర బడ్జెట్ ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. రైతుల పెట్టుబడి సాయంపై బాబు ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరించిందన్నారు. ఎన్నికల ముందు టీడీపీ మేనిఫెస్టోలో రూ.20వేల చొప్పున ఇస్తామని ప్రకటించి, ఇప్పుడు కేంద్రం ఇచ్చే రూ.6వేలతో కలిపి ఇస్తామంటున్నారని విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకానికి కేవలం రూ.4500కోట్లే కేటాయించారని, పెట్టుబడి సాయానికి 52లక్షల మందికి రూ.10వేల కోట్లకు పైగా అవసరం అయితే అరకొర కేటాయింపులు చేశారని తూర్పారబట్టారు. తద్వారా లబ్ధిదారుల్లో భారీగా కోత పెడతారని తెలుస్తోందన్నారు. 20 లక్షల ఉద్యోగాలు, లేదా 3వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఈ బడ్జెట్లో ఆ ప్రస్తావనే చేయలేదని పేర్కొన్నారు. 19–59 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం చేస్తామని, ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పి... ప్రస్తుత బడ్జెట్లో ఆ ఊసే ఎత్త లేదని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను గాలికొదిలేశారని ఎద్దేవా చేశారు.

### వ్యవసాయానికి ప్రాధాన్యత ఏదీ!

వ్యవసాయరంగానికి బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత లభించలేదు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయానికి రూ.4,500 కోట్లు ప్రకటించినప్పటికీ ఎప్పటినుండి అమలు చేసేది తెలపలేదు. రబీ పంట కాలానికి ప్రీమియం చెల్లింపు రైతులే భరించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం దారుణం. ధరల స్థిరీకరణ నిధికి ప్రత్యేకంగా కేటాయింపులు లేవు. పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు ప్రస్తుతం కేటాయించిన కేటాయింపులు సరిపోవు.

–జి. ఈశ్వరయ్య, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ రాష్ట్ర అధ్యక్షుడు

### విద్యారంగానికి కేటాయింపులు పెంచాలి

బడ్జెట్లో విద్యారంగానికి నిధులు 9.8 శాతం నిధులు కేటాయించారు.. గత బడ్జెట్లతో పోలిస్తే ఇది చాలా తక్కువ. ఈ నిధులు ప్రభుత్వ విద్యా రంగాభివృద్ధికి ఏ మాత్రం ఉపయోగపడవు. ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి 30శాతం నిధులు కేటాయించాలని చెప్పిన కొఠారి కమిషన్ సిఫార్సులు దరిదాపుల్లో కూడా ఈ బడ్జెట్ కేటాయింపుల్లో రాకపోవడం శోచనీయం. నాడు– నేడు పనులు నిధులు లేక సగంలో నిలిచిపోయాయి. వాటిని పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలి.

–లక్ష్మిరాజా, రాష్ట్ర కార్యదర్శి, యూటీఎఫ్

### యువత ఉపాధికి నిధులు నిల్

ఉన్నత విద్య, నిరుద్యోగ యువతీ యువకులు ఉపాధి కల్పనతోపాటు కడప ఉక్కు పరిశ్రమకు ప్రాముఖ్యత ఇవ్వకుండా బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. ఇది చాలా అన్యాయం. ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారు. ఈ కేటాయింపులను చూస్తే జీవో నెంబర్ 77 ను రద్దు చేసే ఉద్దేశం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్ష కడప ఉక్కు పరిశ్రమకు బడ్జెట్ లో కేటాయింపులు చెయ్యకపోవటం దారుణం.

– కన్నెలూరు శంకర్, ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం

## న్యూస్‌రీల్

### 14 నుంచి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్ష

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఈనెల 14 నుంచి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారని కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. 18 ఏళ్ల పైబడిన స్త్రీ, పురుషులకు షుగర్, బీపీ, రక్త పరీక్ష, నోరు, రొమ్ము, గర్భాశయ కేన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. జేసీ అదితిసింగ్, ఇన్‌ఛార్జి డీఆర్వో, డీఎంహెచ్‌ఓ నాగరాజు పాల్గొన్నారు.

### వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

కడప రూరల్: వ్యాధులను నివారించే వ్యాధి నిరోధక టీకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో జాతీయ వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ చిన్నారులకు వంద శాతం వ్యాధి నిరోధక టీకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమా, డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ డాక్టర్ వరణ్ ధర్మన్ టీకాల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

### శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కడప అగ్రికల్చర్: కృషి విజ్ఞన కేంద్రంలో ఇచ్చే శిక్షణలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని మెరుగైన జీవనోపాధిని ఏర్పాటు చేసుకోవాలని ఊటకూరు కృషి విజ్ఞనకేంద్ర సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. సోమవారం ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ఎస్సీ ఉప ప్రణాళిక కింద మాంసాధారిత ఆహార ఉత్పత్తుల తయారీపై ఔత్సాహికులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాంసాధారిత ఆహార ఉత్పత్తుల ద్వారా వ్యాపారం చేస్తే ఆర్థికంగా రాబడి ఉంటుందన్నారు. మాంసాహారంలో మంచి పోషకాలు ఉంటాయన్నారు. పశు విజ్ఞన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సురేష్‌కుమార్‌రెడ్డి అధికమాంసం ఉత్పత్తికై తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కూటమి సర్కార్

- రాష్ట్రంలో చీకటి రోజులు నడుస్తున్నాయి
- కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



వికలాంగుడి సమస్యను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్: కూటమి సర్కార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని.. రాష్ట్రంలో చీకటి రోజులు నడుస్తున్నాయని.. వారం రోజుల వ్యవధిలో సుమారు వంద మంది సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేశారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని భాకరాపురంలోని తన నివాసంలో ఆయన ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి ప్రజలు పలు సమస్యలను తీసుకురాగా.. వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

అనంతరం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్‌లు ఏమయ్యాయని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలు అడుగుతుంటే వారిపైన కేసులు నమోదు చేయడం ఏంటని మండిపడ్డారు. హామీలను అమలు చేయకుండా చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ప్రజలకు నమ్మకద్రోహం చేశారన్నారు. రాబోయే కాలంలో మంచి రోజులు వస్తాయని.. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. కాగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి కేంద్ర ప్రభుత్వం ఇంటర్నేషనల్ హైవే రోడ్ల వర్కింగ్ మెంబర్ పదవి ఇవ్వడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనను శాలువాతో కప్పి సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ గూండాల దాడి

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు తీవ్ర గాయాలు



గాయపడిన శ్రీకాంత్‌రెడ్డి

వేంపల్లె: వేంపల్లెలో రోజురోజుకు టీడీపీ గూండాలు రెచ్చిపోతున్నారు. సోమవారం రాత్రి టీడీపీకి చెందిన అబ్దుల్ కడప రోడ్డులో ఉన్న తన ఇంటి వద్దకు శ్రీకాంత్‌రెడ్డిని రమ్మని పిలిపించాడు. అప్పటికే అబ్దుల్‌తో పాటు, నరసింహ, జాకీర్, ఫారుక్, మంజు, అఫ్రోజ్ , నాసిర్‌లు మద్యం తాగి అతనితో గలాటపడ్డారు. వారి మధ్య మాటామాటా పెరిగి కట్టలు, రాడ్లతో దాడికి దిగారు. దీంతో వైఎస్ఆర్‌సీపీ కార్యకర్త శ్రీకాంత్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. ఎస్సై తిరుపాల్ నాయక్‌తోపాటు పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. గాయపడిన శ్రీకాంత్‌రెడ్డిని వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వైద్యుల సూచన మేరకు కడప రిమ్స్‌కు తరలించనున్నారు.

## వినతులకు వేగవంత పరిష్కారం

కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్‌సెల్‌కు వస్తుంటారని, అర్జీదారుల వినతులను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

- తమ గ్రామ పొలం సర్వే నెంబరు 1083లో తమకు 4 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామానికి చెందిన వై.వెంకట సుబ్బమ్మ తెలిపారు. ఈ పొలాన్ని తమ గ్రామానికే చెందిన కుడుముల నాగేశ్వరమ్మ, కొండారెడ్డి అనే వారు దౌర్జన్యంగా ఆక్రమించాలని ప్రయత్నిస్తున్నారన్నారు. దీనిపై విచారణ జరిపించి తగు చర్యలు చేపట్టాలని కోరారు.
- తనకు గతంలో వస్తున్న వృద్ధాప్య పెన్షన్‌ను అకారణంగా నిలిపి వేశారని, విచారణ నిర్వహించి పెన్షన్ పునరుద్ధరించాలని పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామానికి చెందిన దూళ్ల ఆదాం కోరారు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

**అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు**

ఆధార్ నమోదు కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన మేరకే సర్వీసు చార్జీలను చెల్లించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సోమవారం ఒక ప్రకటనలో ప్రజలకు సూచించారు. అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవని సెంటర్ల యజమానులకు హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకే ఆధార్ సేవాకేంద్రాల్లో ఆపరేటర్లు సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. ఆధార్ నమోదు తోపాటు... 5–7 సంవత్సరాలు, 15–17 సంవత్సరాల వారికి బయోమెట్రిక్ అప్డేషన్ (ఎంబీయూ) సేవలు ఉచితమన్నారు. అదనంగా డబ్బు వసూలు చేస్తే కలెక్టరేట్ లోని జిల్లా కంట్రోల్ రూమ్ నెంబర్ 08562 – 246344 కు కాల్ చేయాలని సూచించారు.

## ఉత్సాహంగా ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ





ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో హైజంప్, లాంగ్ జంప్‌లో పాల్గొన్న అభ్యర్థులు

కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో నిర్వహిస్తున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ రెండోరోజూ సోమవారం ఉత్సాహంగా కొనసాగింది. ఉదయం నుంచి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన అభ్యర్థులకు రిజిస్ట్రేషన్, పరుగు పందెం, జిగ్‌జాగ్ బ్యాలెన్స్, హైజంప్, లాంగ్‌జంప్, పుల్ అప్స్ టెస్ట్‌లు నిర్వహించారు. సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు ఈవెంట్ అయినపోయిన వెంటనే అభ్యర్థులకు ఇంక్‌మార్క్ ఉంచారు. అనంతరం ఫిజికల్ టెస్ట్‌లు పూర్తయిన అభ్యర్థులకు మెడికల్ టెస్ట్‌లు నిర్వహించారు. ఎంపికల ప్రక్రియను ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ పర్యవేక్షించారు. కాగా వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన అభ్యర్థులకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సమావేశ మందిరంలో వసతి సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో ఆర్మీ అధికారులు పాల్గొన్నారు. -కడప స్పోర్ట్స్

## అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం



మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు తదితరులు

మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కొనియాడారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబుతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ ప్రఖ్యాత పండితుడు, కవి అయిన అబుల్ కలాం ఆజాద్ అనేక భాషలలో ప్రావీణ్యుడని, భారత ప్రభుత్వంలో విద్యాశాఖామంత్రిగా పనిచేశారన్నారు. విద్యారంగంలో ఆయన అనేక సంస్కరణలు తీసుకొచ్చి భావి భారత పౌరులు ఉన్నత విద్యాభ్యాసానికి బాటలు వేశారన్నారు. కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు పులి సునీల్, కరిముల్లా, బీహెచ్ ఇలియాస్, జయచంద్రారెడ్డి, సుభాన్ బాషా, దాసరి శివప్రసాద్, చెన్నయ్య, త్యాగరాజు, షఫీవుల్లా, అజ్మతుల్లా, వేణుగోపాల్ నాయక్, పవర్ అల్తాఫ్, అబ్దుల్ సుభాన్, ఏ1 నాగరాజు, మునిశేఖర్ రెడ్డి, టీపీ వెంకట సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

**మౌలానా యువతకు ఆదర్శం: కలెక్టర్ శ్రీధర్**



విద్యార్థినికి మెమొంటో అందజేస్తున్న కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్: స్వాతంత్ర సమరయోధులు, భారత తొలి విద్యాశాఖ మంత్రి 'మౌలానా అబుల్ కలాం ఆజాద్'ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను పురస్కరించుకొని అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం భారత విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలు చేపట్టారన్నారు. జిల్లాలో విద్యలో ప్రతిభ చూపిన మైనార్టీ విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా మేమెంటోలు, బహుమతులు అందజేశారు. మైనార్టీల సంక్షేమం కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించిన పలువురు ప్రముఖులకు జిల్లా కలెక్టర్ సన్మానించారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షేక్ ఇమ్రాన్‌తోపాటు పలువురు ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గండికోటలో సినిమా షూటింగ్



హీరో సుమంత్‌పై సన్నివేశం చిత్రీకరణ

జమ్మలమడుగు రూరల్ : గండికోటలో తెలుగు సినిమా షూటింగ్ జరుగుతోంది. అక్కినేని సుమంత్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి సంతోష్ జాగర్లపూడి దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం జమ్మలమడుగు మండల పరిధిలోని గండికోటలో ఉన్న మాధవరాయ స్వామి ఆలయంలో పలు సన్నివేశాలను చిత్రీకరించారు. గండికోట, గ్రామంలో ఈ నెల 19వ తేదీ వరకు ముఖ్య సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు.

### పరమ పవిత్రం.. కార్తిక మాసం



మాట్లాడుతున్న చాపాటి సుబ్బారెడ్డి

బ్రహ్మంగారిమఠం : కార్తిక మాసం పరమ పవిత్రమని ప్రవచనకర్త చాపాటి సుబ్బారెడ్డి తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో జరుగుతున్న మనగుడి కార్తిక వారోత్సవాలు సోమవారం స్థానిక ఈశ్వరీదేవి మఠంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్తిక మాసం విశిష్టత, వ్రతం గురించి భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు, విశ్రాంత అధ్యాపకులు చెన్నారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శేషయ్య, నారాయణస్వామి, రామిరెడ్డి, స్థానిక ప్రముఖులు ఉమాపతి, భాస్కర్‌రెడ్డి, సంపత్ కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### బతుకుదెరువు కోసం వెళ్లి అనంతలోకాలకు

– కువైట్‌లో బద్వేలు వాసి మృతి



మౌలాలి (ఫైల్)

బద్వేలు అర్బన్ : బతుకుదెరువు కోసం వెళ్లిన ఓ వ్యక్తి అనంతలోకాలకు వెళ్లాడు. పట్టణంలోని చాకలివీధికి చెందిన షేక్ మౌలాలి (55) కువైట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మౌలాలి కొన్నేళ్లుగా కువైట్‌లో టైలర్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. నాలుగు నెలల క్రితం ఇండియాకు వచ్చి కుటుంబ సభ్యులతో గడిపి తిరిగి కువైట్‌కు వెళ్లాడు. అయితే ఓ పని నిమిత్తం కువైట్‌లోని మాలియాకు బస్సులో వెళుతుండగా బస్సు ప్రమాదానికి గురికావడంతో మౌలాలి అక్కడికక్కడే మృతి చెందాడు. కువైట్‌లో ఉన్న మౌలాలి స్నేహితుల ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలని వారు కోరారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై

# వేటకొడవళ్లతో దాడి

- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు
- పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



బాధితుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మైలవరం : మండల పరిధిలోని మాధవాపురం గ్రామంలో ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై వేటకొడవళ్లతో దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద కొంత మంది గ్రామస్తులందరూ కలిసి ప్రభుత్వ పథకాలపై మాట్లాడుకుంటున్నారు. ఈ చర్చలో జోగి ఓబయ్య అనే వ్యక్తి ‘ఏ ప్రభుత్వం వచ్చినా మన పనులు మనమే చేసుకోవాలి.. దొందు దొందేలే’ అని అనడంతో అక్కడే ఉన్న టీడీపీ నాయకులైన మొలక నాగమహేష్, నాగేంద్ర ప్రసాద్, నవీన్, నాగరాజు మరి కొంత మంది కలిసి ఓబయ్యతో గొడవ పడ్డారని బాధితుడు వెంకట కొండయ్య తెలిపారు. అయితే అక్కడే తామంతా సర్ది చెప్పి ఇళ్లకు పంపించామని, టీడీపీ నాయకులు మాత్రం తిరిగి ఓబయ్య ఇంటి వైపు వేటకొడవళ్లతో వచ్చినట్లు, ఓబయ్యను పారిపోమ్మని తాను చెప్పడంతో తిడుతూ తనపై కత్తులతో దాడి చేశారని పేర్కొన్నాడు. దీంతో తనకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. చుట్టు పక్కల వారు విడిపించడంతో తన కుమారుడు వెంకటరాజు, వెంకటశివుడు వచ్చి స్కూటర్‌లో జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు చెప్పారు. అక్కడి నుంచి ప్రొద్దుటూరు ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు.

**మాజీ ఎమ్మెల్యే పరామర్శ**

గాయపడి ప్రొద్దుటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకట కొండయ్యను మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరామర్శించారు. గొడవకు గల కారణాలు తెలుసుకుని సంబంధిత పోలీసు అధికారులతో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం, కూటమి నాయకులు చిన్న చిన్న మాటలకు రెచ్చగొటి.. తమ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. అలాగే మండల నాయకులు చిన్న కొమెర్ల మోహన్‌రెడ్డి, తలమంచిపట్నం వినయ్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు బాధితులను పరామర్శించారు.

**ఇరువ ర్గాలపై కేసు నమోదు**

మాధవాపురంలో ఆదివారం రాత్రి జరిగిన గొడవకు కారణమైన ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. చిన్న చిన్న మాటలతోనే గొడవ పెరిగి పెద్దదైందని, ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి రాబోయే రోజుల్లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఒక వర్గం తరఫున నలుగురు, మరో వర్గం తరఫున నలుగురిపై కేసు నమోదు చేశామని వివరించారు.

## ముచ్చటగా మూడో కార్యాలయం

- వేంపల్లెలో టీడీపీ మూడో కార్యాలయం ఏర్పాటు
- ఇక పార్టీలో వర్గాలు ఎన్నో..!
- ఎవరి దగ్గరికి వెళ్లాలోనని సతమతమవుతున్న ప్రజలు



టీడీపీ మూడవ కార్యాలయంలో ప్రజలతో మాట్లాడుతున్న ఆ పార్టీ నేత జయరామిరెడ్డి

వేంపల్లె : వేంపల్లె మండలంలో టీడీపీకి మూడు కార్యాలయాలు ఉండడంతో.. ప్రజలు తమ సమస్యలపై ఎక్కడికి వెళ్లాలో దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారు. సోమవారం గండి రోడ్డులో కొత్తగా టీడీపీకి సంబంధించి మూడవ కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకులు ఏర్పాటు చేశారు. గతంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ వర్గం ఒక కార్యాలయం ఏర్పాటు చేయగా, పులివెందుల రోడ్డులో టీడీపీ మండల కన్వీనర్ సింగారెడ్డి రామమునిరెడ్డి మరొక కార్యాలయం ఏర్పాటు చేశారు. కొత్తగా సింగారెడ్డి జయరామిరెడ్డి ముచ్చటగా మూడవ టీడీపీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించి ప్రజా సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. మండల ప్రజలు తమ సమస్యలను టీడీపీ నాయకులకు చెప్పాలంటే.. ఏ కార్యాలయానికి వెళ్లాలో అర్థం కాక ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా వీరిలో ఎన్ని వర్గాలు ఉన్నాయో అంత చిక్కడం కాలేదు. ఒక వర్గం మండల అభివృద్ధి కోసం పాటుపడుతుంటే, మరో వర్గం వాటిని అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఒకే నాయకుడు ఉంటూ ఒకే తాటిపై నడిపిస్తూ.. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజా సమస్యలన్నింటినీ తీర్చేవారని టీడీపీలోనే కొంత మంది కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక కూటమిలో వర్గాలు పెరిగిపోవడంతో.. ఎక్కడికి వెళ్లాలో తెలియక మండల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా పార్టీలో విధి విధానాలు సరిగా లేవని కార్యకర్తలే అసహన వ్యక్తం చేస్తున్నారు. ఇలా వర్గ పోరుతో రోజు రోజుకు విభేదాలు బయటపడుతున్నాయి. ఇప్పటికైనా టీడీపీ నాయకులు మండల అభివృద్ధిపై దృష్టి సారించాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

### సోషల్ మీడియాలో టీడీపీ వ్యతిరేక పోస్టులపై కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : పలు వాట్సాప్ గ్రూపుల్లో వచ్చిన టీడీపీ వ్యతిరేక పోస్టులపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి పలు పత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. పత్రికల్లో వచ్చిన క్లిప్పింగ్‌లను జోడించి పలు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టారు. ఈ పోస్టులు టీడీపీ ప్రతిష్టను దిగజార్చే విధంగా ఉన్నాయని కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి సోమవారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రొద్దుటూరు వార్తవాహిని, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ గ్రూపుల్లో పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చే విధంగా పోస్టులు పెడుతున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. కాగా సోషల్ మీడియా వ్యవహారంలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వర్రా రవీంద్రారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించలేదు.

### ఆర్ట్ ఆఫ్ ఏపీ పుస్తకంలో చోటు

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 64 కళలకు సంబంధించిన 300 మంది సీనియర్ చిత్రకారులు గురించి రచించిన ‘ఆర్ట్ ఆఫ్ ఏపీ’ బుక్‌ను విజయవాడలో 10న ఆవిష్కరించారు. ఇందులో 35 ఏళ్లు పైబడిన సీనియర్ ఆర్టిస్టులకు అవకాశం కల్పించారు. కానీ ఇందులో 26 ఏళ్ల వయసు కలిగిన గంప మల్లయ్యకు అవకాశం దక్కింది. విజయవాడకు చెందిన ప్రముఖ రచయిత కళాసాగర్.. గంప మల్లయ్య పెయింటింగ్స్ నచ్చి ఆయన గురించి ఆ పుస్తకంలో ప్రచురించారు. ఆ పుస్తకాన్ని పద్మశ్రీ అవార్డు గ్రహీత సీవీ రాజు చేతుల మీదుగా గంప మల్లయ్యకు అందజేశారు.

### బీసీల ఐక్యతకు కృషి చేస్తా

– ఎమ్మెల్సీ రమేష్ యాదవ్



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్ : రాష్ట్రంలోని బీసీల ఐక్యతకు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన కలిశారు. ఎమ్మెల్సీ అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాత రాష్ట్రంలోని 26 జిల్లాల్లో పర్యటించనున్నట్లు జగన్ దృష్టికి తీసుకెళ్లారు. బీసీల సమస్యలపై అధ్యయనం చేస్తానని ఆయనకు వివరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులతో కలిసి సమన్వయంగా బీసీ కమిటీలను ఏవిధంగా ఏర్పాటు చేసేది ఆయనతో చర్చించానన్నారు.

## డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు



షాన్, గుంటూరు (5 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–14 క్రికెట్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెండో రోజు బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 63.4 ఓవర్లలో 247 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని హర్ష 60, తమన్ సాయి 59 పరుగులు చేశారు. అనంత బౌలర్లు కిరణ్‌కుమార్ 4, లిఖిత్ 4 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 27 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 121 పరుగులు చేసింది. జట్టులోని ప్రణధీర్ 55, కిరణ్‌కుమార్ 40 పరుగులు చేశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో 322 పరుగులు చేసిన అనంత జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

**గుంటూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం**

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెండో రోజు బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు 53.3 ఓ వర్లలో 139 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని జోగేంద్ర 38, హర్షవర్ధన్ 22 పరుగులు చేశారు. గుంటూరు బౌలర్లు షాన్ 3, విజయ్‌కుమార్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు 37 ఓవర్లలో 72 పరుగులు చేసింది. జట్టులోని పవన్‌కుమార్ 27, కిరణ్ 12 పరుగులు చేశారు. గుంటూరు బౌలర్ షాన్ 5, గోపీచంద్ 2 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో 334 పరుగులు చేసిన గుంటూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

**నెల్లూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం**

వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెండో రోజు బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 80.3 ఓవర్లలో 260 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని లీలావికాస్ 79, యశ్వంత్ 62, కిన్నుకుషాల్ 52 పరుగులు చేశారు. విజయనగరం బౌలర్ సాత్విక్ 3 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విజయనగరం జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 69 పరుగులు చేసింది. జట్టులోని అభినవ్ 30 పరుగులు చేశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా విజయనగరం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 250 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో నెల్లూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

## వాలీబాల్ విజేతగా జిల్లా జట్టు



బాలికల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

భోగాపురం : విజయనగరం జిల్లా భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా మూడు రోజుల పాటు సాగిన బాల,బాలికల 68వ అండర్–14 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో కడప, శ్రీకాకుళం జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో భాగంగా నిర్వహించిన పోటీలు సోమవారం ముగిశాయి. మూడో రోజు అండర్–14 బాలబాలికల వాలీబాల్ ఫైనల్ పోటీలు రసవత్తరంగా సాగాయి. బాలికల విభాగంలో కడప జట్టు గెలుపొంది రాష్ట్ర స్థాయి విజేతగా నిలిచింది.

## రగ్బీ రాష్ట్ర జట్ల ఎంపిక



రాష్ట్ర జట్లకు ఎంపికైన క్రీడాకారులతో టోర్నమెంట్ నిర్వాహకులు

కమలాపురం : రగ్బీ రాష్ట్ర జట్లకు ఎంపికైన సభ్యుల జాబితాను టోర్నమెంట్ పరిశీలకుడు రమేష్, ఆర్గనైజర్స్ అరుణ కుమారి, తిరుపాల్‌రెడ్డి, గణేష్ బాబు, శివ శంకర్‌రెడ్డి విడుదల చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు రగ్బీ రాష్ట్ర స్థాయి అండర్–14 బాల బాలికల ఎస్‌జీఎఫ్ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో బాలికల జట్టు విజేతగా కర్నూలు, బాలుర జట్టు విజేతగా నెల్లూరు నిలిచిందన్నారు. అలాగే రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారుల పేర్లు విడుదల చేశారు.

**బాలకల జట్టు**

సౌమ్య(కర్నూలు), పూజిత (కర్నూలు), దివ్య (కర్నూలు), సారధి(వైఎస్సార్), దీక్షిత (వైఎస్సార్), చాముండేశ్వరీ (చిత్తూరు), వైష్ణవి (అనంతపురం), లక్ష్మీ ప్రసన్న (ప్రకాశం), శ్రీజ (వెస్ట్), లాస్య (కృష్ణా), ఎవంతి (విశాఖ), సీత (నెల్లూరు).

**బాలుర జట్టు**

జోయల్ (నెల్లూరు), చరణ్ (నెల్లూరు), మహేష్ బాబు(కర్నూలు), మహేష్ (కర్నూలు), చిరుత (ప్రకాశం), గౌతమ్(కృష్ణా), బాల స్వరూప్ (చిత్తూరు), సుబ్రహ్మణ్యం (ఈస్ట్), పునీత్ రాజు (వైఎస్సార్), రెహమాన్ (వైఎస్సార్), రమేష్ (శ్రీకాకుళం)



## భూ వివాదంపై ఘర్షణ

ఇరు వర్గాలను చెదరగొట్టిన పోలీసులు



వివాదాస్పద భూమిలో వాగ్వాదానికి దిగిన ఇరు వర్గాల వారు

గోపవరం : మండలంలోని మడకలవారిపల్లె రెవెన్యూ పొలం 809 సర్వే నంబరులోని 5.08 ఎకరాల రిజిస్టర్ భూ వివాదంపై.. సోమవారం ఇరువర్గాలు ఘర్షణకు దిగడంతో బద్వేలు రూరల్ పోలీసులు రంగప్రవేశం చేసి చెదరగొట్టారు. వివరాల్లోకి వెళితే.. నూనెరాజేశ్వరికి చెందిన ఈ భూమికి సంబంధించి గత కొంత కాలంగా వివాదాస్పదంగా ఉంది. దీంతో రెండు వర్గాల వారు కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తుంది. ఈ నేపథ్యంలో నూనెరాజేశ్వరి జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి సంబంధించిన వర్గీయులను ఆశ్రయించడం జరిగింది. ఈ మేరకు జమ్మలమడుగు నుంచి ఆదినారాయణరెడ్డి వర్గీయులు సోమవారం వివాదాస్పద భూమిలో జేసీబీ ఉపయోగించి చదును చేసేందుకు ప్రయత్నించారు. వారిని స్థానికంగా ఉన్న మరో వర్గానికి చెందిన టీడీపీ నాయకులు అడ్డుకోవడం జరిగింది. దీంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న బద్వేలు రూరల్ పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని రెండు వర్గాల వారిని చెదరగొట్టారు. కాగా ఈ వివాదంపై పోలీసుస్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## ఇద్దరిపై దాడి



బాబు కాలుపై గాయాలు



గాయపడ్డ రామసుబ్బమ్మ

లింగాల : మండలంలోని పార్నపల్లెలో పొలం తగాదా విషయంలో జరిగిన దాడిలో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బోనాసి బాబు, సరస్వతమ్మ దాయాదులు. వీరికి యల్లనూరు మండల పరిధిలోనూ, పార్నపల్లె గ్రామ సమీపంలో పొలాలు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా పొలం విషయంలో తగాదా పడుతున్నారు. గత ఏడాది మే నెలలో సరస్వతమ్మ కుటుంబ సభ్యులు.. బాబు పొలంలోని అరటి మొక్కలను తొలగించారు. దీంతో యల్లనూరు పోలీసులు, రెవెన్యూ అధికారులు పొలాలకు హద్దులు నిర్ణయించారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో సోమవారం సరస్వతమ్మ ఆమె కుమార్తె కుమారి, అల్లుడు శ్రీనివాసులు.. బోనాసి రామసుబ్బమ్మ, ఆమె కుమారుడు బాబులపై ఇంటి వద్ద దాడి చేశారు. అరటి పిల్లలు కోసే ఢిల్లీ కొడవలితో బాబు కాలికి తీవ్ర గాయాలు చేశాడు. అదే విధంగా రామసుబ్బమ్మ తలపై రక్త గాయాలు చేశారని ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



## బింబం.. ప్రతిబింబం



ప్రకృతి సోయగం సందర్శకులను పరవశింపజేస్తోంది. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం రామాపురం మండలం మేదరపల్లి వద్ద రమణీయ దృశ్యాలు వారి మనసు దోచుకుంటున్నాయి. ఎంతో సుందరంగా ఉన్న రాళ్లు, చెట్లు అబ్బురపరుస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పెద్ద గుంతల్లో నీరు చేరింది. ఆ నీటిలో రాళ్లు, చెట్లు, నీలిమేఘాల ప్రతిబింబాలను చూసి మైమరిచిపోతున్నారు. చిత్రకారులు గీసిన చిత్రాలుగా.. ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి.

– మహమ్మద్ రఫీ, సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

### పుష్పగిరిని దర్శించుకున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి



జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న అర్చకులు

వల్లూరు : జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి కుటుంబ సమేతంగా సోమవారం పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిని సందర్శించారు. కార్తీక మాస రెండవ సోమవారాన్ని పురస్కరించుకుని వారు పుష్పగిరి శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ మండపంలో కార్తీక దీపాలను వెలిగించి పూజలు చేశారు. అనంతరం శ్రీ సంతాన మల్లేశ్వర స్వామిని దర్శించుకుని స్వామి వారికి విశేష ద్రవ్యాలతో అభిషేకాన్ని నిర్వహించారు. శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి, లక్ష్మీదేవిలను దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను, ఆశీర్వచనాలను అందచేశారు.

### భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

రాజంపేట రూరల్ : అత్తిరాలలోని శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామికి రెండవ కార్తీక సోమవారం సందర్భంగా భక్తి శ్రద్ధలతో అధిక సంఖ్యలో భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. అత్తిరాల పరిసరాలలో శివనామస్మరణం హోరెత్తింది.